సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 23 । మే । 2024



అనుమానాస్పద స్థితిలో..

కొత్తగూడెం ప్యానబస్తీలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.

8లో



పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

8లో

గరిష్టం / కనిష్టం

38°/ 27°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

నేడు చండీహోమం పూజలు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. హోమంలో సంప్రదాయ దుస్తులు మగవారు తెల్లపంచె, కండువా, మహిళలు చీరలు ధరించాలని పేర్కొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. తాగునీటి సరఫరా పైపులు లీకవకుండా శ్రద్ధవహించాలని పేర్కొన్నారు. జంతు కళేబరాలు, చెత్తాచెదారం కలిసి తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని వివరించారు. అనారోగ్యానికి గురైతే తప్పనిసరిగా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ల సలహాలు సూచనలు పాటించాలని కోరారు.

రేపు పాలిసెట్

- హాజరుకానున్న 1,755 మంది విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 24న పాలిసెట్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ బి. నాగముని నాయక్ తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనుండగా, 1,755 మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పరీక్ష కేంద్రంలోకి గంట ముందే అనుమతిస్తామని, నిమిషం నిబంధన అమలు చేస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్ మీద ఫొటో స్పష్టంగా లేనివారు ఒక పాస్‌పోర్టు సైజుఫొటో, ఐడీ ప్రూఫ్ (ఆధార్‌కార్డ్) తప్పక తెచ్చుకోవాలని సూచించారు.

ఓసీలో పరిశీలన



ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీని బుధవారం జీఎం(ఎస్టేట్స్) వెంకటయ్య సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం మణుగూరు ఓసీ పునరావాస ప్రాంతమైన కొత్త కొండాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. అనంతరం జీఎం దుర్గం రాంచందర్‌తో సమావేశమై ఏరియాలో అన్ని ఓసీలకు ఒకేసారి లీజు తీసుకునేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. అధికారులు శ్యాంసుందర్, శ్రీనివాసాచారి, సురేశ్, శ్రీనివాస్, బాబుల్ రాజు, శైలేందర్‌కుమార్ పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌లో తనిఖీ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో 39 మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి వివరాలు తెలుసుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. జీఎం జాన్ ఆనంద్, కిషోర్ కుమార్, నర్సింహరాజు, విజయ శేఖర బాబు, జీవీ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇక 'స్థానిక' పోరు..

గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారుల కసరత్తు

- జిల్లాలో 481 గ్రామపంచాయతీలు
- గ్రామాల్లో మొదలుకానున్న సందడి



చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో.. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాకు అవసరమైన 1,250 బ్యాలెట్ బాక్సులను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి తెప్పించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల్లో సవరణలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉండగా, 2019 జనవరిలో పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మరో రెండు భద్రాచలం, సారపాక పంచాతీయలకు ఎన్నికలు జరపలేదు. ఇక రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులు లేకపోవడంతో పాల్వంచ మండలంలోని సంగం, నారాయణరావుపేట పంచాయతీలకు సైతం ఎన్నికల ప్రక్రియ చేపట్టలేదు. ఆ సమయంలో 54 గ్రామపంచాయతీలు, 820 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఫిబ్రవరి 2 నుంచి బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరి 31తో ముగిసింది. దీంతో గత ఫిబ్రవరి 2 నుంచి ప్రభుత్వం ప్రత్యేక అధికారులతో పల్లె పాలన సాగిస్తోంది.

గతంలో కొంత కసరత్తు..

గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తక్షణమే కొత్త ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీల అమలుపై దృష్టిపెట్టింది. అనంతరం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులు కొంతవరకు కసరత్తు చేశారు. సిబ్బంది కేటాయింపు, ఓటర్ల జాబితాలో సవరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటివి పూర్తిగా చేపట్టారు. ఆ లోగా పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం అవి కూడా పూర్తికావడంతో ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆశావహుల్లో ఉత్సాహం..

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు జరుగుతుండటంతో ఆశావాహుల్లో ఉత్సాహం మొదలైంది. రాజకీయంగా ఎదిగేందుకు సర్పంచ్ పదవిని తొలిమెట్టుగా భావిస్తూ.. పలువురు పోటీకి సిద్ధమవుతున్నారు. గతంలో ఓడిపోయినవారు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ఆయా పార్టీల నాయకులు, యువకులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తిగా ఉన్నారు. పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఇటీవల అధికార కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో పాత, కొత్త నేతలతో ఆశావహుల సంఖ్య పెరిగి అధికార పార్టీలో పోటీ తీవ్రమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు పార్టీ పెద్దలను కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

2019లో పంచాయతీ ఎన్నికల తీరు

విడత	పంచాయతీలు	వార్డులు	మండలాలు
మొదటి	174	1,534	7
రెండో	142	1,294	7
మూడో	163	1,404	7



రిజర్వేషన్ల వర్తింపుపై సందిగ్ధం

గతంలో ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు ప్రకటించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించేవారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి రిజర్వేషన్లను పదేళ్లకు పొడిగించింది. ఈ క్రమంలో గత ఎన్నికల్లో వర్తించిన రిజర్వేషనే వచ్చే ఎన్నికల్లోనూ ఉంటుంది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తేలాల్సి ఉంది. పరిషత్ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. వచ్చే నెల 4 వరకు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. ఆ తర్వాత ప్రభుత్వం బీసీ కమిషన్‌తో అభిప్రాయ సేకరణ, సర్వే నిర్వహించి రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటోందో చూడాల్సి ఉంది.

చట్టసభలో యువవాణి వినిపిస్తా

- బాల్యంలోనే ఎర్రజెండా ఉద్యమాలపై మక్కువ
- మహానేత వైఎస్సార్ పథకాలతో రాజకీయాలపై ఆసక్తి
- అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రమేశ్



కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జల్లారపు రమేశ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపించింది. ఈ ఎన్నికలను ఇటు కాంగ్రెస్ మిత్ర పక్షాలు, అటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు సవాల్‌గా తీసుకుని గెలుపే లక్ష్యంగా శ్రమిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నడుమ స్వతంత్ర అభ్యర్థిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మిమిక్రీ ఆర్టిస్టు, జల్లారపు రమేశ్ బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయడానికి గల కారణాలను ఆయన వివరించారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో..

నేను పుట్టి పెరిగిందంతా కొత్తగూడెంలోనే. ఆ రోజుల్లో సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టులు పోరాటాలు చేసేవారు. దీంతో సహజంగానే ఎర్రజెండా భావజాలం పట్ల ఆకర్షణ ఉండేది. ఇదే సమయంలో చిన్నప్పటి నుంచి సినిమాలు బాగా చూడటం అందులోని నటులను అనుకరించే అలవాటు ఉండేది. ముఖ్యంగా సినిమా టైటిల్స్‌లో నందమూరి తారక రామారావు బీఏ అని పేరు పడటం చూసి చిన్నప్పుడే బీఏ చదవాలని ఫిక్స్ అయ్యాను. ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో బీఏ డిగ్రీ పూర్తి చేశాను.

జర్నలిస్టుగా..

విద్యార్థి దశ ముగిసిన తర్వాత జర్నలిస్టుగా ప్రింట్ మీడియాలో ప్రయాణం మొదలైంది. వివిధ పత్రికల్లో పని చేసిన తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా వైపు వెళ్లాను. అప్పటికే మిమిక్రీ ఆర్టిస్టుగా బాగా గుర్తింపు ఉండటంతో టీవీ రంగంలో రాణించాను. అయితే జర్నలిస్టుగా రాజకీయాలను దగ్గర నుంచి పరిశీలించే అవకాశం వచ్చింది.

వైఎస్సార్‌ను చూసి..

మిమిక్రీ ఆర్టిస్టుగా వందలాది మంది ప్రముఖుల గొంతులను అనుకరిస్తూ షోలు చేశాను. ఈ క్రమంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కన్నుమూసిన తర్వాత నిర్వహించిన అనేక సభల్లో ఆయన్ని అనుకరిస్తూ మాట్లాడేవాడిని. ఈ క్రమంలో ఆయన ప్రవేశపెట్టిన 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రస్తావిస్తున్నప్పుడు సభికుల నుంచి విశేష స్పందన లభించేది. ఆ కార్యక్రమం తర్వాత నా మిమిక్రీని మెచ్చుకుంటూనే వైఎస్సార్ హయాంలో తమ బతుకుల్లో వచ్చిన మార్పు గురించి చాలా మంది నా దగ్గర ప్రస్తావించేవారు. ఆ సమయంలో వారు చెబుతున్న విషయాలు వింటే గుండె బరువెక్కేది. అది క్రమంగా పెరుగుతూ వచ్చి, రాజకీయాలను చూడటమే కాదు అందులోకి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చాను.

ఇండిపెండెంట్‌గా..

యువత ఆశలు, ఆకాంక్షలు చట్టసభల్లో బలంగా వినిపించే గొంతు కావాలి. ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు తమను గెలిపించిన పట్టభద్రుల కంటే ప్రాతినిధ్యం వహించే పార్టీలకే ఎక్కువగా కట్టుబడి ఉంటున్నారు. అందువల్లే చదువుకున్న యువత వాణిని చట్ట సభల్లో స్వేచ్ఛగా వినిపించేందుకు ఖమ్మం- నల్గొండ -వరంగల్ పట్టభద్రుల స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నాను. ఒక కళాకారుడిగా ప్రజల ఇబ్బందులను ప్రజావేదికలపై బలంగా వినిపిస్తూ వచ్చాను. పట్టభద్రుల మద్దతు లభిస్తే చట్టసభల్లో సమస్యలపై గళం విప్పుతా.

మిమిక్రీ ఆర్టిస్టుగా..

మిమిక్రీ ఆర్టిస్టుగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. దేశం నలుమూలల ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో ఇరవైకి పైగా స్టేజీ షోలు చేశాను. ఆస్ట్రేలియా, దుబాయ్, బహ్రెయిన్, కువైట్, ఉగాండా లాంటి దేశాల్లో తెలుగువారికి ప్రదర్శనలు ఇచ్చాను. జర్నలిస్టుగా, మిమిక్రీ కళాకారుడిగా విజయవంతమైన నేను ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా రాజకీయ ప్రయాణం మొదలెడుతున్నాను.

యూనిఫామ్ త్వరగా అందించాలి



కుట్టు మిషన్ కేంద్రంలో పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

సుజాతనగర్: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫామ్ అందించాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. సర్వారం గ్రామంలోని డ్వాక్రా సంఘాల కుట్టుమిషన్ కేంద్రాలను ఆమె బుధవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంను మహిళా సంఘాల ద్వారా కుట్టిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రాజేష్, నోడల్ అధికారి సునందన్, డీపీఎం నాగజ్యోతి, ఏపీఎం మీరాంభి, సీసీలు భారతి, శిరీష పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్నకు విరాళం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సంఘం బాధ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

దమ్మపేట/మణుగూరు టౌన్: ఈ నెల 27న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలని కాంగ్రెస్ మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సూచించారు. బుధవారం మణుగూరు, దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, గ్యారంటీలను అర్థమయ్యేరీతిలో వివరించి, తనకు ఓటు వేసేలా ఒప్పించాలని అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు కనీసం ప్రచారం చేసేవారు కూడా లేరని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆక్రమించుకున్న భూములపై ప్రశ్నించినందుకు తనపై అక్రమంగా కేసులు బనాయించి, జైల్లో పెట్టారని ఆరోపించారు. ప్రజల హక్కుల కోసం పోరాడి తాను జైలుకు పోయాను తప్ప, కేసీఆర్ బిడ్డ కవితలా మద్యం కేసులో జైలు మెట్లు ఎక్కలేదని, తన ఇంటి పంచాయితీలతో కేసులు కాలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అక్రమాలు వెలుగులోకి తెస్తున్న తనకు రూ.కోట్లు, పదవులు ఆఫర్ చేసినా తిరస్కరించానని, సొంత ఆస్తులు ప్రభుత్వానికి రాసిచ్చానని పేర్కొన్నారు. కేసీఆర్ సింగరేణి ప్రైవేటీకరణకు ప్రయత్నించారని, 46, 317 జీవోలు తెచ్చి ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, నిరుద్యోగుల ఉద్యోగ కల్పనకు కృషిచేస్తానని మల్లన్న హామీ ఇచ్చారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ మల్లన్న ఎమ్మెల్సీగా గెలిచాక ప్రభుత్వ పాలనలోలేమైనా తప్పులు దొర్లితే ప్రశ్నించాలని కోరారు. కాగా దమ్మపేటలో గెస్ట్ లెక్చరర్ల సంఘం సభ్యులు, తీన్మార్ మల్లన్నకు ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ.50వేలు విరాళంగా చెక్కు రూపంలో సభావేదికపైనే అందజేశారు. నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జ్‌లు పిడమర్తి రవి, నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, చందా సంతోష్, కాటబోయిన నాగేశ్వరరావు, పీరినాకి నవీన్, గొడిశాల రామనాథం, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, దుగ్గంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీపీఐ, టీడీపీ టీజేఎస్ నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, నైనారపు నాగేశ్వరరావు, సరెడ్డిపుల్లారెడ్డి, దుర్గొగ్యల సుధాకర్, ఐఎన్‌టీయూసీ కృష్ణంరాజు, కొర్సా ఆనంద్, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, ముస్లిం, మైనార్టీ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా డిజిటలైజేషన్ చేయాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): నెలాఖరులోగా ఉద్యోగుల వివరాలు, ఫొటోలు డిజిటలైజేషన్ చేయాలని సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం పర్సనల్, ఎస్టేట్స్, వివిధ గనుల సంక్షేమాధికారులతో నిర్వహించిన ఆయన మాట్లాడారు. డిజిటలైజేషన్, క్వార్టర్లు, ఉద్యోగుల గైర్హాజరు, కోర్టు కేసులు, కారుణ్య నియామక దరఖాస్తులు, టర్మినల్ బెనిఫిట్స్ తదితర అంశాలపై చర్చించారు.

యోగా శిక్షణకు మోక్షమెప్పుడో?

- జిల్లాలో నిరుపయోగంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు
- నిర్మించి ఏళ్లు గడిచినా ప్రారంభించని వైనం
- అందుబాటులోకి వస్తే ప్రకృతివైద్యం, యోగాపై శిక్షణ
- ఆశా వర్కర్లను శిక్షకులుగా నియమించే యోచనలో ప్రభుత్వం



జూలూరుపాడు పీహెచ్‌సీ ఆవరణలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్

జూలూరుపాడు: ఏళ్లు గడిచినా హెల్త్‌వెల్‌నెస్(ఆరోగ్య స్వస్థత) కేంద్రాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. ఫలితంగా ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణలో ఆయుష్ విభాగం కింద వీటిని ఏర్పాటు చేశారు. యోగా శిక్షణ ద్వారా రోగాలు రాకుండా చూడటం, వస్తే త్వరగా నయం చేయడం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యాన్ని అందించి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించేందుకు జిల్లావ్యాప్తంగా 12 ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేంద్రాల ఏర్పాటుకు రూ. 72 లక్షల వ్యయం

యునాని, ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులకు అనుబంధంగా ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున రూ.72 లక్షలతో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో యోగా షెడ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. దీర్ఘకాలిక బీపీ, షుగర్, ఆస్తమా, కీళ్ల నొప్పులు, వాపులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధులు, పక్షవాతం తదితర వైద్యసేవలు అందించాలని నిర్ణయించారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంపై శిక్షణ, యోగా, ఫిజియోథెరఫీ, ఆరోగ్య సూత్రాలు, సలహాలు, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలని భావించారు. కానీ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వైద్య సేవలు అందడంలేదు. అక్కడక్కడా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినా శిక్షణ, వైద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు.

నిరుపయోగంగా..

జిల్లాలో రెండు యునాని, ఏడు ఆయుర్వేద, మూడు హోమియో వైద్యశాలల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అశ్వారావుపేట, భద్రాచలం ఇల్లెందు ప్రాంతాల్లో ప్రభుత్వ హోమియో వైద్యశాలలకు అనుబంధంగా, భద్రాచలం, జూలూరుపాడు(పాపకొల్లు) ప్రభుత్వ యునాని, ఆర్లగూడెం (దుమ్ముగూడెం), భద్రాచలం, ఆర్.కొత్తగూడెం (చర్ల), రొంపేడు, అశ్వాపురం, నాగుపల్లి(దమ్మపేట), చంచుపల్లి ఆయుర్వేద వైద్యశాలలకు అనుబంధంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయుష్ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, వైద్యులు, సిబ్బంది, మందుల కొరత వంటి సమస్యలతో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. కొన్ని ఆయుష్ వైద్యశాలలు పీహెచ్‌సీలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో సమస్యలను అధిగమించవచ్చునని ప్రభుత్వం భావించింది. కానీ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

సిబ్బంది నియామకాలేవి?

ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో యోగా శిక్షకుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఫార్మసిస్టు, పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. యోగా శిక్షణా కేంద్రాలు నిర్మించి రెండేళ్లకాగా, కాంట్రాక్టు పద్ధతిలో యోగా శిక్షకులను తీసుకోవాలని నిర్ణయించినా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. తాజాగా ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చి యోగా శిక్షకులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే..



ఆయుష్ ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాల్లో ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చి యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలను ప్రారంభించి వైద్య సేవలందిస్తాం.

– డాక్టర్ కె.రాజేందర్‌రావు, ఆయుష్ శాఖ జిల్లా ఇన్‌చార్జి

27 నుంచి విజయవాడ రైలు రద్దు

కొత్తగూడెంఅర్బన్: రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా విజయవాడ రైలు రద్దైనట్లు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ వరకు రాకపోకలు సాగించే రైలును ఈ నెల 27వ తేది నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశామని, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కేరళ అపెక్స్ బ్యాంక్‌లో డీసీసీబీ బృందం

ఖమ్మంవ్యవసాయం: కేరళ విజ్ఞాన యాత్రలో ఉన్న డీసీసీబీ పాలకవర్గం బాధ్యులు బుధవారం అక్కడి అపెక్స్ బ్యాంకును సందర్శించారు. అలెప్పీలోని బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, ఇస్తున్న రుణాలపై అధ్యయనం చేశారు. తొలుత టెక్కడి ప్రాంతంలోని మార్కెటింగ్ సొసైటీలను సందర్శించిన బృందం సభ్యులు సుగంధ ద్రవ్యాల వ్యాపారంపైనా ఆరా తీశారు. సుగంధ ద్రవ్యాల సేకరణ, మార్కెటింగ్ వివరాలు తెలుసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఎమ్మెల్సీ ఎన్నికలపై వీసీలో కలెక్టర్ ప్రియాంక



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనమండలి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఏఆర్‌ఓలతో బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు సౌకర్యాలు కల్పించామని, ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామని వివరించారు. ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

24 వరకు పోస్టల్ బ్యాలెట్ గడువు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 24వ తేదీ లోగా ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎమ్మెల్సీ ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన చేశారు. శాసనమండలి వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గ పట్టభద్రుల ఉప ఎన్నికలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం కలెక్టరేట్‌లోని రూం నంబరు ఎఫ్‌-7లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 70 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: పరోక్షంగా, ప్రత్యక్షంగా మావోయిస్టులకు సహకరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజు హెచ్చరించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని తునికాకు వ్యాపారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మావోయిస్టులతో తునికాకు వ్యాపారులు, కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తునికాకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించారు. మావోయిస్టుల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆదివాసీ ప్రజలకు నష్టం వాటిల్లకుండా వారి సంక్షేమం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరగనున్న టీ–20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును గురువారం ఎంపిక చేశారు. అండర్–23 విభాగంలో ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 105 మంది క్రికెటర్లు హాజరయ్యారు. వీరితో పాటు ఇప్పటికే వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రికెటర్ల నుంచి జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా జట్టుకు టీవీఎస్.నారాయణ, ఎస్‌కే సమీర్, వంశీ, సాయిచంద్, విశాల్ యాదవ్, తేజ్‌రామ్, నాగేంద్ర, ఫరీద్, లోకేశ్, సమీర్, రియాజ్, శశి, బన్నీ, మహిత్, శివాన్, దివాన్ ఎంపికయ్యారని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఫారుఖ్‌ఖాన్, తురాబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ఉద్యోగులపై చర్యలకు సిఫారసు!

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి దేవాదాయ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేసినట్లు సమాచారం. దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ విధుల్లో ఉన్న ఓ ఉద్యోగి ఈఓ క్యాంప్ కార్యాలయంలో కీలక ఉద్యోగిగా గతంలో పనిచేశారు. అతని వాస్తవ పోస్టింగ్‌లో కాకుండా ఇతర పోస్టింగ్‌లో పనిచేసినందుకు గాను అధిక వేతనం తీసుకున్నారని ఆడిటింగ్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని, రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి సైతం అభ్యంతరాలు వ్యక్తం చేసి నివేదికను ఈఓకు సమర్పించారు. కాగా ఈఓ తాజాగా ఆ ఆడిట్ అభ్యంతరాలతో కూడిన నివేదికను పంపించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సింగా కమిషనర్‌ను కోరినట్లు తెలుస్తోంది.

బీర్లు లేవు.. ఐబీ అమ్మడం లేదు!

ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

పాల్వంచరూరల్: వేసవిలో చల్లటి బీర్లతో పాటు ఇంపీరియల్ బ్లూ మద్యం వైన్స్‌లలో అమ్మడం లేదని పాల్వంచ మండలం రెడ్డిగూడెంకు చెందిన జైపాల్‌రెడ్డి బుధవారం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. డిమాండ్ ఉన్న కింగ్ ఫిషర్‌తోపాటు ఇతర బీర్లు, మద్యం లేదంటూ వైన్స్ నిర్వాహకులు కొరత సృష్టిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, బెల్టుషాపుల్లో మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. కాగా, బీర్ల కొరత విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై ఆరా తీస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య చెప్పారని జైపాల్‌రెడ్డి వెల్లడించారు.

గంజాయి స్వాధీనం

బూర్గంపాడు: మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి సారపాక ప్రధాన కూడలిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ మోటార్ సైకిల్‌ను ఆపకుండా పోనివ్వగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. బైక్‌పై ఉన్న వ్యక్తి వద్ద 15.15 కిలోల గంజాయి దొరికింది. సదరు వ్యక్తి చింతూరు మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన తునికి లక్ష్మయ్య అలియాస్ లక్ష్మణ్‌గా పోలీసులు గుర్తించారు. గంజాయి విలువ రూ.3.78 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి, బైక్, సెల్‌ఫోన్ సీజ్ చేశామని, లక్ష్మణ్‌తో పాటు గంజాయి రవాణాలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సుమన్ బుధవారం తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

అందుబాటులో జీలుగు, పిల్లి పెసర, జనుము విత్తనాలు

- 50 శాతానికి పైగా సబ్సిడీపై అందుబాటులోకి..
- ఉమ్మడి జిల్లాలో 25 వేల క్వింటాళ్లకు పైగా పంపిణీకి ప్రణాళిక
- పీఏసీఎస్‌లు, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా నేటి నుంచి విక్రయాలు



పచ్చిరొట్టను కలియదున్నతున్న రైతు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వివిధ రకాల పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవడం ఆనవాయితీ. భూసారాన్ని పెంపొందించటానికి పచ్చిరొట్ట పైర్ల సాగు దోహదం చేయనుండగా, ఆ తర్వాత సాగు చేసే పంటలకు పెట్టుబడి కూడా తగ్గుతుంది. భూసారం పెరగానికి కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, కోళ్లు, గొర్రెల ఎరువులను గతంలో వినియోగించగా.. ఇప్పుడు కొరత ఏర్పడడంతో పచ్చిరొట్ట ఎరువులు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యాన జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా వరి, మిరప, ఉద్యాన పంటలు సాగు చేసే భూముల్లో రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తున్నారు.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖమ్మం జిల్లాలో 21,276 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 4,394 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నివేదిక ఇచ్చారు. ఖమ్మం జిల్లా ఇండెంట్‌లో జీలుగు 19,100 క్వింటాళ్లు, జనుము 1,904 క్వింటాళ్లు, పిల్లిపెసర 272 క్వింటాళ్లు ఉండగా, ఇప్పటి వరకు జీలుగు 9,972 క్వింటాళ్లు, జనుము 980 క్వింటాళ్లు, పిల్లి పెసర 40 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇండెంట్‌లో జీలుగు 3,900 క్వింటాళ్లు, జనుము 422, పిల్లిపెసర 72 క్వింటాళ్లు ఉండగా, ఇప్పటి వరకు జీలుగు 2,012 క్వింటాళ్లు, జనుము 298 క్వింటాళ్ల మేర అందుబాటులో వచ్చాయి. జీలుగు విత్తనాలను ఆగ్రా, ఢిల్లీ నుంచి, జనుము, పిల్లి పెసర విత్తనాలను మెదక్, రంగారెడ్డి జిల్లాల నుంచి సమకూరుస్తున్నారు.

విత్తనాలపై సబ్సిడీ

సేంద్రియ ఎరువును ప్రోత్సహించడంలో భాగంగా పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. జీలుగు విత్తనాలకు 55.80, జనుము 54.30, పిల్లి పెసరకు 81.30 శాతం సబ్సిడీగా నిర్ణయించారు. దీంతో జీలుగు విత్తనాల కిలో ధర రూ.93 కాగా సబ్సిడీపై రూ.37.20కు, జనుము విత్తనాలు కిలో ధర రూ.90.50 కాగా రూ.36.20కు, పిల్లి పెసర కిలో ధర రూ.135.50 కాగా రూ.54.20కే రైతులకు అందిస్తారు.

విత్తనాల వివరాలు, ధరలు

విత్తనం	బ్యాగు పరిమాణం (కిలోల్లో)	ధర (రూ.ల్లో)
జీలుగు	30	1,116.00
జనుము	40	1,448.00
పిల్లి పెసర	20	1,084.00

నేటి నుంచి విక్రయాలు

పచ్చిరొట్ట విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా గురువారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 26 పీఏసీఎస్‌లతో పాటు రెండు జిల్లాల్లోని ఆరు ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా పచ్చి రొట్ట విత్తనాలను విక్రయించేందుకు విత్తనాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేసింది. రైతులకు అవసరమైన మేర పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ మేనేజర్ బిక్షం వెల్లడించారు.

ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి

వైద్యులకు డీఎంహెచ్‌ఓ సూచన

మణుగూరురూరల్/మణుగూరుటౌన్/అశ్వాపురం: ప్రజలకు స్థానిక వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ శిరీష సూచించారు. బుధవారం ఆమె మణుగూరు, అశ్వాపురం మండలాల్లో పర్యటించారు. పలు గ్రామాల్లో జ్వర ప్రభావంపై ఆరాతీశారు. వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాలను సందర్శిస్తూ.. రక్త నమూనాలను సేకరించాలని, అవసరమైనవారికి చికిత్స అందించాలని చెప్పారు. అనంతరం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి జ్వరపీడితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆమె వలస గొత్తికోయ గ్రామం రేగులగండిని సందర్శించారు. గ్రామస్తుల ఇమ్యునైజేషన్, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ స్పందన, ఎన్‌వీబీడీసీపీ శివకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేగులగండిలో నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది, పక్కన డీఎంహెచ్‌ఓ శిరీష

పంటల బీమా పథకాల అమలుపై శిక్షణ



పంటల బీమాపై వివరిస్తున్న డీఆర్పీ రాజు, వేదికపై కమిషనరేట్ కార్యాలయ అధికారి అనిత తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాల అమలుకు కసరత్తు జరుగుతుండగా.. ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వ్యవసాయాధికారులు, ఎంపిక చేసిన రైతులకు బుధవారం ఖమ్మం కలెక్టర్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు. కమిషనరేట్ కార్యాలయానికి చెందిన ఏడీఏ అనిత ఆధ్వర్యాన ఈ సమావేశం జరగగా, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది పంటలకు కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ప్రధాన మంత్రి బీమా పథకం, పత్తి, మిర్చి, మామిడి వంటి పంటలకు అమలుచేస్తున్న వాతావరణ ఆధారిత బీమా పథకాల విధివిధానాలపై రిసోర్స్ పర్సన్లు (డీఆర్పీ) రాజు, సాయినారాయణ వివరించారు. బీమా ప్రీమియం వాటా, చెల్లింపు విధానం తదితర అంశాలపై వ్యవసాయాధికారులు, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రెండు జిల్లాల నుంచి హాజరైన రైతుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఖమ్మం డీఏఓ ఎం.విజయనిర్మల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రణాళిక అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఉద్యాన అధికారులు బీవీ.రమణ, సూర్యనారాయణ, కేవీకే కోఆర్డినేటర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9న ఆలిండియా ట్రైబల్ ఫోరం ఆవిర్భావ సదస్సు

ఫోరం జాతీయ కన్వీనర్ సత్యం, కోకన్వీనర్ నాగేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న ఫోరం నాయకులు

ఇల్లెందు: దేశవ్యాప్తంగా ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణ కోసం పోరాడుతుంటే వారిని క్రూరంగా హతమారుస్తూ ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆలిండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, కోకన్వీనర్ సూర్నబాక నాగేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యాన ఫాసిజానికి వ్యతిరేకంగా ఆదివాసీ సమాజం ఇతర అట్టడుగు వర్గాలతో కలిసి పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని చెప్పారు. ఇల్లెందులోని పెన్షనర్ల భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖపట్నంలో వివిధ రాష్ట్రాల ఆదివాసీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ ఫోరం ఏర్పడిందని తెలిపారు. పది రాష్ట్రాల్లో ఆలిండియా ట్రైబల్ ఫోరం ఆవిర్భావ సదస్సులు నిర్వహిస్తూ రాష్ట్రస్థాయి కమిటీలను నియమిస్తున్నామని, ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రస్థాయి సదస్సు జూన్ 9న కొత్తగూడెంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలను అడవి నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే కాక ఆదివాసీల రక్షణగా ఉన్న చట్టాలను ఎత్తివేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. ఈ నేపథ్యాన ఆదివాసీలను ఏకం చేసి హక్కుల సాధన, చట్టాల రక్షణకు పోరాడుతున్నట్లు సత్యం, నాగేశ్వరరావు వెల్లడించారు. సమావేశంలో నాయకులు వీసం కృష్ణ, చింతా ఉదయ్, చింత రజిత తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



పుట్టిన పాపతో 108 సిబ్బంది

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామంలో బానోతు వాణి 108లో ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి.. కారుకొండ రామవరం గ్రామానికి చెందిన బానోతు రమేశ్ సతీమణి వాణికి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. 108 వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగానే నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే కాన్పు చేయగా.. పాప జన్మించింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో వారిని రామవరంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. పైలట్ హరిశంకర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

- మృతిపై పలు అనుమానాలు
- చోరీ చేసేందుకు వచ్చిన దుండగుల పనే అంటున్న స్థానికులు
- మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు చోరీ



దేవరాజు ప్రమీల మృతదేహం

కొత్తగూడెంటౌన్: ప్యూన్‌బస్తీలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు దేవరాజు ప్రమీల (68) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో మంచం కింద అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే, ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ కోసం వచ్చిన దుండగులు హత్య చేశారా? ఇంకా ఏదైనా జరిగిందా? అని స్థానికులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌లో ఉంటున్న ప్రమీల పెద్ద కుమారుడు మహేందర్ తన తల్లికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో స్నేహితులు రఫీ, మందా వెంకట్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారిద్దరు ప్రమీల ఇంటికి వెళ్లగా ఆమె కదలలేని స్థితిలో మంచం కింద పడిఉండటంతో వారు మహేందర్, పోలీసులు, 108కు కు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్, క్లూస్‌టీం, పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. 108లో చేరుకున్న వైద్యులు ప్రమీల మృతిచెందిందని ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న కుమారులు మహేందర్, వినోద్ హైదరాబాద్ నుంచి కొత్తగూడెంకు చేరుకున్నారు. ప్రమీల హత్యకు గురై ఉంటుందని, బంగారం కోసం వచ్చిన దుండగులు హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



వివరాలు సేకరిస్తున్న సీఐ కరుణాకర్, క్లూస్ టీం

అసలు ఏం జరిగింది?

కొత్తగూడెం ప్యూన్‌బస్తీలో దేవరాజు ప్రమీల భర్త ప్రభాకర్ ఏడాది కింద మృతిచెందగా పెద్ద కుమారుడు మహేందర్, చిన్న కుమారుడు వినోద్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కొంతకాలం కుమారుల వద్ద ఉన్న ప్రమీల అనంతరం ప్యూన్‌బస్తీలో ఒంటరిగా ఉంటోంది. మంగళవారం రాత్రి బంధువుల శుభకార్యానికి వెళ్లిన ప్రమీల రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చింది. తెల్లవారేసరికి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కాగా, ప్రమీల ఒంటిపై ఉన్న బంగారు పుస్తెలతాడు, చెవి కమ్మలు, ముక్కు పుడక కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ముగ్గురు మహిళలు ఎవరు?

ప్రమీల ఇంటి సమీపంలో రాత్రి 11 గంటల సమయంలో ముగ్గురు మహిళలు ఎర్రరంగు చీర ధరించి అనుమానాస్పదంగా కనిపించారని ఇంటి పక్కన ఉన్న వ్యక్తి తెలిపారు. శుభకార్యానికి వెళ్లి వచ్చిన ప్రమీల ఇంటికి వచ్చిన ముగ్గురు మహిళలు ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మృతురాలి కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో వివరాలు సేకరించింది.

కాల్వలోకి దూసుకెళ్లిన బొలేరో

ఏడుగురికి గాయాలు



కాల్వలో పడిపోయిన బొలేరో వాహనం

చర్ల: మండలంలోని దానవాయిపేట సమీపంలో మృతదేహాన్ని తరలిస్తున్న ఓ బొలేరో వాహనం అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లగా ఏడుగురు గాయపడ్డారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దోర్నపాల్ సమీపంలోని దుబ్బతోటకు చెందిన ఓ వ్యక్తి చర్ల మండలంలోని బూరుగుపాడులో మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామానికి బొలేరో వాహనంలో తరలిస్తున్నారు. దానవాయిపేట సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి తాలిపేరు ప్రధాన కాల్వలోకి దూసుకెళ్లింది. వాహనంలో పది మంది ఉండగా అందులో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. వైద్యాధికారి దివ్యనయన ప్రాథమిక చికిత్స అందించారు.

మద్యం రవాణా చేసిన వ్యక్తికి ఆరు నెలలు జైలు

కొత్తగూడెంటౌన్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన కేసులో కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన కుసుమ శ్రావణ్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బత్తుల రామారావు బుధవారం తీర్పు చెప్పారు. 2019 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దమ్మపేట సెంటర్‌లో ఏప్రిల్ 9వ తేదీన వాహన తనిఖీలు చేస్తుండగా హోండా స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఆపి పరిశీలించగా మద్యం బాటిళ్లు దొరికాయి. 147 మద్యం బాటిళ్లతో పట్టుబడిన కుసుమ శ్రావణ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. ముగ్గురు సాక్షులను విచారించిన జడ్జి నేరం రుజువు కావడంతో శ్రావణ్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మనోవర్తి చెల్లించని వ్యక్తికి నెల..

కొత్తగూడెంటౌన్: మనోవర్తి చెల్లించనందుకు పాల్వంచ వనమాకాలనీకి చెందిన పానుగంటి వినయ్‌కు నెలరోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం కొత్తగూడెం మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలిలా ఉన్నాయి.. వనమాకాలనీకి చెందిన పానుగంటి మనీషాకు వికలాంగులకాలనీకి చెందిన పానుగంటి వినయ్ 2023 జూన్ 13 నుంచి రూ.44 వేలు మెయింటనెన్స్ (మనోవర్తి) చెల్లించకపోవడం, కోర్టుకు హాజరు కాకపోవడంతో ఉప్పుశెట్టి సునీల్‌కుమార్ న్యాయవాదిని కమిషనర్‌గా నియమించారు. ఆయన పానుగంటి వినయ్‌ను కోర్టులో హాజరు పరిచారు. విచారించిన జడ్జి పానుగంటి వినయ్‌కు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మనీషా తరఫున న్యాయవాదులు యాస యుగంధర్, మౌనిక వాదించారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి

టేకులపల్లి: విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి బిల్లుడుతండాలో ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు పంట పొలాల్లో తెగిపడ్డాయి. భూక్య భీమా, ఆంగోతు సోమా, అజ్మీర సురేశ్‌కు చెందిన మూడు ఆవులు బుధవారం మేతకు వెళ్లి విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన జక్కుల ప్రమీల (25) ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. తల్లి జక్కుల వీరమ్మ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేశారు. కాకతీయనగర్‌కు చెందిన ప్రమీల కుటుంబ సమస్యల కారణంగా ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఇసుక లారీ పట్టివేత

పాల్వంచరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని బుధవారం ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. తోగ్గూడెం అటవీ ప్రాంతంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రేంజర్ సిబ్బందితో కలిసి లారీని పట్టుకుని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తునన్న లారీడ్రైవర్ రమేశ్, లారీ ఓనర్ నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీఓ తెలిపారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడు, గంజాయితో పోలీసులు

దమ్మపేట: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బుధవారం మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలో పోలీసులు, నార్కోటిక్ అధికారులు కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. చిల్లగుంపు గ్రామానికి చెందిన కొయ్యల సత్తిబాబు (57) ద్విచక్ర వాహనంపై రెండు కేజీల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. సత్తిబాబును అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.